

పస్పులలో ప్రాథమిక పాఠశాలలోకి వచ్చిన వరద



సంగంబండ రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో ఉరుకలేస్తున్న నీటి ప్రవాహం



మరికల్‌లో నీట మునిగిన వరి పంట



కోస్గిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ముశ్రీఫా వాగు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

ముంచెత్తిన వాన

సాక్షి నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు నిండి ప్రవహించాయి. పలు చోట్ల రోడ్లు, వంతెనలు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

- నారాయణపేటలో కోటకొండ చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతుంది. అదేవిధంగా సింగారం వాగుకు వరద పోటెత్తింది.
- మరికల్‌లో వరద జాతీయ రహదారి పైనుంచి ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కన్మనూర్, పల్లెగడ్డలో రెండు ఇళ్లు కూలిపోయాయి.
- కోస్గిలో వర్షం ధాటికి తాత్కాలికంగా నిర్మించిన రహదారి నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో దౌల్తబాద్-కోస్గి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ,ట్రెయిని కలెక్టర్ ప్రణయ్ పరిస్థితిని పరిశీలించారు.
- ధన్వాడలో గోటూర్ గ్రామం నుంచి చిన్నరాజామురుకు వెళ్లే దారిలో ఉన్న కోయిల్‌సాగర్ ఉధృతంగా పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మన్నెవాగుకు కూడా వరద ప్రవాహం పెరగడంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఈనెల 17 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.
- కొత్తపల్లి-భూనీడు మధ్యలో వేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. అలాగే నిడ్జింత-మద్దూరు మధ్యలో వాగుపై వరద ప్రవాహం పెరగడంతో అధికారులు రాకపోకలు నిలిపేశారు.



మన్నెవాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్



నర్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న కల్వాల్ వాగు



కన్మనూర్ మన్నేవాగుపై నడుచుకుంటూ వస్తున్న రైతులు



కొత్తపల్లి-భూనీడు మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



సింగారం వాగుకు వరద ఉధృతి

క్లుప్తంగా

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



కోస్గి రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రామాలయం చౌరస్తా నుంచి సయ్యద్‌పహడ్ దర్గా వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు అభివృద్ధికి సహకరిస్తామని తెలుపడంతో మిగిలిన గృహాలను జేసీబీతో కూల్చివేశారు. రెండు రోజులు క్రితం ప్రభుత్వం 112 మంది బాధితులకు నష్టపరిహారం అందజేయడంతో పలువురు ముందుకొచ్చారు.

విత్తన బంతుల తయారీ



కోస్గి రూరల్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంగ్ యర్త్ లీడర్స్ సమన్వయ కర్త వార్ల మల్లేషం అన్నారు. మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి 'ప్రకృతి నడక' కార్యక్రమంలో భాగంగా గురువారం గుట్ట ప్రాంతంలో విత్తన బంతులను వేశారు. మానవ చర్యల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని స్వచ్ఛమైన గాలి నీరు, ఆహారం అందే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులు తమ బాధ్యతగా 50 వేల విత్తన బంతులను గుట్టలోని వివిధ ప్రాంతాలలో జారవిడిచారు. భవిష్యత్తు మాదే.. బాధ్యత మాదే అనే రీతిలో విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

నారాయణపేట రూరల్: పట్టణంలోని సింగారం చౌరస్తాలో శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ లోకపల్లి సంస్థానానికి 1667లో వచ్చారని ఇక్కడి నుంచి గోల్కొండ వెళ్లేందుకు నారాయణపేట, కోటకొండ, కోయిలకొండ మీదుగా వెళ్లారని ఇక్కడి చరిత్ర చెబుతుందన్నారు. కావున ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అందుకు స్థలం కేటాయించాలని వినతిలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో కురుమన్న, కన్న శివ కుమార్, మహేష్ , శ్రావణ్, నరసింహ, పళ్ల రఘు, చక్రి, శివాజీ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నర్వ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అన్నారు. గురువారం లంకాల్, ఉందేకోడ్ గ్రామాల్లో స్థానిక పంచాయతీ కార్యదర్శులు రాజాబాబు, కాంగ్రేస్ నాయకులతో కలిసి పలు ఇళ్లకు ముగ్గులు వేసి నిర్మాణాలను ప్రారంభించారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు త్రివేణి, కాంగ్రేస్ పార్టీ నాయకులు అశోక్‌గౌడ్, కొండన్న, బాల్‌రాజు, విష్ణుసాగర్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను గురువారం ఆ సంస్థ అధినేత సూర్యమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయస్వామి, ఎల్లమ్మ ఆలయాల దగ్గర మరమ్మతుకు నోచుకొని హైమాస్ట్ లైట్లను రూ. 70 వేలు ఖర్చు చేసి పునరుద్ధరణ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కోస్గి: అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సిబ్బంది బాధితులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ సూచించారు. గురువారం కోస్గి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పరికరాలు, వాటి పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. అత్యవసరమైన పరికరాలను ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అంబులెన్స్ సిబ్బంది అసద్, శంషాద్దీన్ ఉన్నారు.

కోతకు గురైన ప్రధాన రహదారి



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డు అంచుభాగం కోతకు గురైంది. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు కోతకు గురై ప్రమాదకరంగా మారినా పంచాయతీరాజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

కూలిన మట్టిమిద్దె



ఊట్కూర్: మండలంలో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని అనంతమ్మకు చెందిన మట్టిఇల్లు కూలిపోయింది. అలాగే గొల్ల దివాకర్‌కు చెందిన పశువుల పాక కూలిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పెద్దపొర్ల గ్రామ శివారులో చెరువు దగ్గర వరద పోటెత్తడంతో చిన్ని పొర్ల గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మల్లెపల్లి గ్రామ శివారులో లోతట్టు ప్రాంతం లోని కల్వర్ట్‌పై వరదనీరు ఉధృతంగా పారుతుండంతో మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి, సోమేశ్వరబండ గ్రామాలకు రాకపోకలు నిలిపేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ లింగయ్య, మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని భూనీడు వాగు, దుప్పడిగట్టు, కొత్తపల్లి వాగు పరిసరాల్లో వరద పరిస్థితులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా వరద నీటిలో చిక్కుకున్నా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ 100 నంబరుకు లేదా 87126 70399 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

అత్యవసరమైతేనే బయటికి రండి

మాగనూర్/కోస్గి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో కోస్గి సీఐ సైదులు, మాగనూర్ ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో వేర్వేరుగా బందోబస్త్ ఏర్పాటు చేశారు. మండలంలోని నేరడగం, మాగనూర్, అడవిసత్యావార్ పెద్దవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు ఎవరు వెళ్లొద్దని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు.



వాగులో వరద పరిస్థితులను పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం

నారాయణపేట రూరల్/నారాయణపేట టౌన్: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాద్గిర్ జనార్దన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం విడుదల చేసి మాట్లాడారు. సీపీఎస్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని దాన్ని రద్దు చేసేంత వరకు సంఘం పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసే ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయసుధ, బాలరాజ్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, రఘువీర్, జనార్దన్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి

మక్తల్: మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి, యర్నాగాన్‌పల్లి, కాచ్‌వార్ గ్రామాలకు చెందిన రైతులు గురువారం మక్తల్ తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు రూ.14 లక్షలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మార్కెట్ ధరల ప్రకారం రూ. 40 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని కోరారు. మిగతా నియోజకవర్గాల్లో రూ.24 లక్షలు పరిహారం ఇస్తే మంత్రి నియోజకవర్గంలో రూ.14 లక్షల ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సతదీస్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, సీఐటీయూ బాల్‌రాం ,జిల్లా కార్యదర్శి అంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

ఊట్కూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విధులు నిర్వర్తిస్తున్న హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు కొక్కు గౌతం కోరారు. వసతి గృహంలో ఓ విద్యార్థినిని వార్డెన్ తాగిన మైకంలో బుధవారం రాత్రి గెంటివేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు.ఈ మేరకు గురువారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో కూడా పేద విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసే హాస్టల్ వార్డెన్ మద్యం మత్తులో విద్యార్థులపై రాత్రి వేళలో దురుసుగా ప్రవర్తించి, బయటికి పంపించడానికి ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


దాతల సాయంతోనే విద్యాభివృద్ధి

నర్వ: దాతల సాయంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి మెరుగవుతోందని పాథర్చేడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణ అన్నారు. గురువారం పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు, దాత ఎస్ఎస్ రాములు విద్యార్థులకు వైట్ యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ఉచితంగా అందించిన దాత ఎస్ రాములను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహేష్, శ్రీనువాసులుగౌడ్, వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించుకుంటే చర్యలు

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఇళ్ల ముందర ఉన్న రోడ్లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పుర కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. వర్షాల నేపథ్యంలో గురువారం కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములుతో కలిసి వార్డ్ వాచ్ కార్యక్రమం చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వీధి రోడ్లను కూడా వెడల్పు చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే ఎస్సీ కాలనీ పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరు ఉండొద్దని సూచించారు.

రీల్స్ పిచ్చితో వాగులో విన్యాసాలు



మద్దూరు: మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసులు ఓవైపు హెచ్చరిస్తుంటే పలువురు ఆకతాయిలు విన్యాసాలు చేశారు. రీల్స్ చేసే క్రమంలో వాగులో పలు విన్యాసాలు చేశారు. కొత్తపల్లి మండలంలోని భూనీడ్ వాగులో పలువురు మద్యం మత్తులో రీల్స్ చేశారు. పోలీసులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశానిర్దేశంతో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచనలతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

20న క్రీడాకారుల ఎంపిక పోటీలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో ఈ నెల 20న జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఎంపికలు ఉంటాయని నారాయణపేట జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. అండర్-14,16,18, 20 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. పరుగు పందెలు, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్ వంటి తదితర అథ్లెటిక్ పోటీలు నిర్వహించి సత్తా చాటిన బాలురు, బాలికలు ఈ నెల 30,31వ తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారన్నారు. వివరాల కొరకు 91007 53683, 90593 25183 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోల్స్ పైనే అత్యధిక ఫిర్యాదులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్తు వినియోగదారుల ఫోరంలో అత్యధికంగా పోల్స్ కావాలని ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో 161 ఫిర్యాదులు వచ్చాయని ఇందులో విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయలతో పాటు పలు సమస్యలపై వినియోగదారుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక డీఈఈ నర్సింహ రావు, జగన్ మోహన్, ఏఈ మహేష్ గౌడ్, బాల్ రాజు, డివిజన్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం

నారాయణపేట టౌన్: దిందా గ్రామ రైతుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ రైతుల పక్షాన నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నారాయణపేట జిల్లా స్వేరో అధ్యక్షుడు నడ్డిరాజు అన్నారు. వెంబడే ఆయనను విడుదల చేయాలన్నారు. లేదంటే ప్రజల పక్షాన నిలబడి నిరసన వ్యక్తం చేసిన ప్రవీణ్ కుమార్‌ను ముట్టుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామన్నారు.

ఏడుగురికి సేవా పతకాలు

నారాయణపేట: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. నారాయణపేట జిల్లా నుంచి ఏడుగురు సేవా పతకాలకు ఎంపికయ్యారు. వారిలో ఉత్తమ సేవ పతకం కె.చంద్రప్ప ఎస్బీ , సేవ పథకాలు నారాయణపేట టౌన్ పీఎస్ ఎస్ఎస్ఐ బి.అంజిలయ్య, మరికల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రయ్య, నారాయణపేట రూరల్ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్ వి.కుర్మయ్య, నారాయణపేట డీఏఆర్‌లో హెడ్ కానిస్టేబుళ్లు కె.క్రిష్ణయ్య, ఆర్ .శ్రీనివాస్, బి.నర్సయ్యలు ఎంపికయ్యారు.

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

నారాయణపేట: దేశ వ్యాప్తంగా ఓటర్ల లిస్టులో అవకతవకలకు పాల్పడుతూ బీజేపీ ప్రజాస్వామ్యన్ని ఖునీ చేసిందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణికారెడ్డి విమర్శించారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఓట్ చోరీ కార్యక్రమంపై డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ లో బతికున్న వారిని చనిపోయినట్లు, ఒకే ఇంటిపై పదుల సంఖ్యలో ఓటరులుగా నమోదు చేయడం, ఫారం 6ను దుర్వినియోగం చేయడం లాంటి అక్రమాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెలికి తీయడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో ఓటరు నమోదులో జరుగుతున్న అక్రమాలపై దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం కొవ్వొత్తులతో పట్టణ రహదారుల గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ. సలీం, వివిధ మండలాల అధ్యక్షులు నరహరి, వీరన్న, యగ్నేష్ రెడ్డి, ఆనంద్ గౌడ్, కోట్ల రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గందే చంద్రకాంత్, మనోహర్ గౌడ్, వకీల్ సంతోష్, సుధాకర్, కోణంగేరి హన్మంతు, సూర్య మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

ధన్వాడ: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టేం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం ధన్వాడ మండలంలోని కొండాపూర్ గ్రామంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనంలో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నారాయణపేట రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లీగల్ సర్వీసెస్ చైర్మెన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు తెలిపారు. గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామ జేపీ ఆవరణలో చట్టాలు, ర్యాగింగ్ ముప్పు నివారణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాగింగ్ చేసినా, సహకరించినా వారికి సమాన శిక్ష ఉంటుందన్నారు. దాడి చేయడం, నేర పూరితమైన శక్తిని ప్రదర్శించి తోటి విద్యార్థులను భయపెట్టడం మొదలగునవి ర్యాగింగ్‌గా భావించవచ్చని దీని కోసం హెల్ప్‌లైన్ 18001805522కి సంప్రదించాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, రూ.మూడు లక్షల లోపు ఆదాయం కలిగిన బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సురేష్, లక్ష్మీపతి గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరహరి, అన్నమ్మ, యాదమ్మ, రూపక, ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

మహాసభలను జయప్రదం చేయండి

నారాయణపేట టౌన్: అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ మహా సభలు ఈ నెల 25, 26వ తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరిగే సభలను విజయవంతం చేయాలని ఏఐయూకేయస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ నర్సింములు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. ఈ ఖరీఫ్‌కు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ఆశాజనకంగా లేవన్నారు. వరి క్వింటాలుకు గతంతో పోలిస్తే రూ.69 మాత్రమే పెంచి చేతులు దులుపుకున్నారన్నారు. పత్తికి క్వింటాలుకు రూ.16 వేలు ప్రకటించమని సిఫార్సు చేస్తే కేవలం రూ.7710 మాత్రమే ప్రకటించి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కావున కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధరలలో మార్పులు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం సహాయనిధి ఎల్‌ఓసీల అందజేత

నర్వ: పేదలకు సీఎం సహాయనిధి ఒక వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అన్నారు. ఉందేకోడ్, లంకాల్ గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్సల నిమిత్తం ఆర్థిక సాయం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో బాధితులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీలు మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ నేత బాధితుల కుటుంబాలకు ఎల్‌ఓసీలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాంకి జనార్దన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రాజారెడ్డి, కొండన్న, విష్ణుసాగర్, బాల్‌రాజు, రవిసాగర్, పాండు, తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి ఎల్‌ఓసీ అందజేస్తున్న చెన్నయ్యసాగర్